

తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద

## టీబీ డ్యాంకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అయిజ, జూలై 27 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు లక్ష క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరుతుండడంతో డ్యాంలోని 33 గేట్లను ఎత్తారు. 1,49,535 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 1,36,734 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 1,58,434 క్యూసెక్కులుగా ఉన్నది. 105.788 టీఎంసీల సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 99.586 టీఎంసీల నిల్వ ఉన్నది. 1,633 అడుగుల నీటి మట్టానికిగానూ 1,631.44 అడుగులు ఉన్నట్లు డ్యాం ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

***ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ..***

కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు భారీగా వరద నీరు చేరుతుండడంతో జలకళ సంతరించుకున్నది. శనివారం 1,26,700 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 1,26,050 క్యూసెక్కుల వరద సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 13.7 అడుగుల మేర నీటి మట్టం ఉందన్నారు.

***ఆల్మట్టి, నారాయణపూర్‌కు..***

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద చేరుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి 2,96,794 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 3 లక్షల క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటిమట్టం 1,705 అడుగులకు గానూ 1,687.69 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 113.69 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 76.698 టీఎంసీలుగా ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 3,00,064 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. గరిష్ఠస్థాయి నీటిమట్టం 1,615 అడుగులకుగానూ ప్రస్తుతం 1,609.12 అడుగులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ 25.164 టీఎంసీలు ఉన్నది.



ఆర్డీఎస్ ఆనకట్టపై నుంచి పారుతున్న వరద

## ఆర్డీఎస్ ఆయకట్టుకు నీటి విడుదల

అయిజ, జూలై 27 : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని సింధనూర్ సమీపంలోని ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ నుంచి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీఎస్ నీటితోపాటు తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గంలోని 87,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆర్డీఎస్ ప్రధానకాల్వలో గంగమ్మకు శాస్ర్తోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ సీతారాంరెడ్డి, మేడికొండ లక్ష్మీకాంతారావు, శ్రీనివాసులు, దొడ్డప్ప, నర్సింహులు, దేవేందర్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీఎస్ ఆయకట్టుకు పారుతున్న వరద

## దిగువ జూరాలలో నిలిచిన విద్యుదుత్పత్తి

- ఎగువ జూరాలలో ఐదు యూనిట్లలో కొనసాగింపు

ఆత్మకూరు, జూలై 27 : ఎగువ నుంచి వస్తున్న భారీ వరదల కారణంగా దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. 2.50 లక్షల క్యూసెక్కులకు పైగా అవుట్‌ఫ్లో ఉండడంతో యంత్రాలు వైబ్రేషన్లు వస్తున్నాయని, దీంతో విద్యుదుత్పత్తిని నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎగువ జూరాలలో 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపడుతున్నట్లు ఎస్ఈ సబ్బరామిరెడ్డి తెలిపారు. ఎగువ జూరాలలో శుక్రవారం అర్ధరాత్రి వరకు 2.272 మిలియన్ యూనిట్లు జరుగగా, మొత్తంగా 27.123 మి.యూ ఉత్పత్తి అయ్యింది. దిగువ జూరాలలో 1.975 మి.యూ మాత్రమే ఉత్పత్తి జరుగగా, మొత్తంగా 32.995 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది.



సుంకేసుల డ్యాం గేట్ల నుంచి దిగువకు పరుగులు తీస్తున్న వరద

## సుంకేసుల డ్యాం గేట్ల ఎత్తివేత

రాజోళి, జూలై 27 : సుంకేసుల డ్యాంకు శనివారం వరద పెరగడంతో 28 గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కుల నీటిని శ్రీశైలం డ్యాంకు తరలిస్తున్నట్లు డ్యాం ఏఈ రాజు తెలిపారు. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ 1.23 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.438 టీఎంసీలు ఉన్నది. కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



జూరాల గేట్ల నుంచి దిగువకు పారుతున్న వరద

# కృష్ణమ్మ ఉగ్రరూపం

- క్రమక్రమంగా పెరుగుతున్న వరద
- జూరాల ప్రాజెక్టులో 44.., టీబీ డ్యాంలో 33 గేట్ల ఎత్తివేత
- శ్రీశైలానికి 2.50 లక్షల క్యూసెక్కుల రాక
- నదీప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



***ర్యాలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో శనివారం నాటికి 1.67టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎడమ కాల్వ (104ప్యాకేజీ)కు 257 క్యూసెక్కులు, కుడి కాల్వకు 697 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. - గట్టు, జూలై 27***

గద్వాల, జూలై 27 : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జూరాలకు వరద రోజురోజుకూ పెరుగున్నది. శనివారం ప్రాజెక్టుకు 3.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలు నిండుకుండలా మారి వరద అధికంగా వస్తుండడంతో జూరాలలో 44గేట్లు ఎత్తి 2,91,384 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.490 మీటర్లుగా ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 7.627 టీఎంసీలుగా ఉన్నది. విద్యుదుత్పత్తికి 18,471 క్యూసెక్కులను విడుదల చేస్తుండగా, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్-1కు 1,300, భీమా లిఫ్ట్-2కు 750, జూరాల ఎడమ కాల్వకు 820, కుడికాల్వకు 453 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యాం 30 గేట్లు ఎత్తి దిగువకు 3,13,619 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు.



## బీచుపల్లి వద్ద ఉధృతంగా వరద

**ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి భారీగా వరద వచ్చి చేరుతున్నది. ప్రస్తుతం మూడు లక్షల క్యూసెక్కుల వరద జూరాల నుంచి దిగువకు ప్రవహిస్తున్నది. బీచుపల్లి పుష్కరఘాట్ వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఎస్సై వెంకటేశ్ సిబ్బందితో పర్యవేక్షణ చేపట్టారు.**

**– ఇటిక్యాల, జూలై 27**



## నిండుకుండలా నిజాంకొండ..

**మొన్నటివరకు నీళ్లు లేక వట్టిపోయి కనిపించిన పెబ్బేరు మండలం రంగాపురం కృష్ణానది ప్రస్తుతం నిండుకుండను తలపిస్తున్నది. వారం రోజులుగా జూరాల నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో పుష్కరఘాట్లు సైతం మునిగిపోయాయి. నది వంతెన మీదుగా వెళ్లే ప్రయాణికులు నీటిని చూసి పరవశిస్తున్నారు.**

**– పెబ్బేరు, జూలై 27**

## రిజర్వాయర్లకు పంపింగ్

మక్తల్, జూలై 27 : మక్తల్ మండలం సంగంబండ పెద్దవాగుపై నిర్మించిన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, మక్తల్ మండలం భూత్పూర్ వద్ద నిర్మించిన భూత్పూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ కొనసాగుతున్నది. బీమా ఫేజ్-1లోని చిన్న గోప్లాపూర్ వద్ద స్టేజీ-1 పంప్‌హౌస్ నుంచి 1,300 క్యూసెక్కుల నీటిని కృష్ణానది నుంచి ఎత్తిపోస్తున్నారు. సమాంతర కాల్వ ద్వారా భూత్పూర్ రిజర్వాయర్‌కు 500 క్యూసెక్కులు, మక్తల్ తిరుమలాయ చెరువు కట్ట వద్ద ఉన్న స్టేజ్-2 పంప్‌హౌస్ నుంచి 800క్యూసెక్కుల వరద నీరు చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అధికారులు పంపింగ్ చేస్తున్నారు. రిజర్వాయర్‌లో 1.92 టీఎంసీల నీరు వచ్చి చేరినట్లు వెల్లడించారు. రైట్, లెఫ్ట్ కెనాల ద్వారా సాగుకు 50 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



చిన్న గోప్లాపూర్ వద్ద స్టేజీ-1 పంప్‌హౌస్ నుంచి పంపింగ్ అవుతున్న నీరు



## శ్రీశైలానికి పోటెత్తిన వరద

- డ్యాంకు 2,97,886 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

శ్రీశైలం, జూలై 27 : శ్రీశైల జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. శనివారం జూరాల విద్యుదుత్పత్తి ద్వారా 18,471 క్యూసెక్కులు, క్రస్ట్ గేట్ల ద్వారా 2,91,384 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 99,736 క్యూసెక్కుల ద్వారా నీరు వచ్చి చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులకు గానూ ప్రస్తుతం 867.00 అడుగులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 130.0724 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 2,97,886 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కాగా, 53,795 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ద్వారా నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.



బహిరంగ సభాస్థలిని పరిశీలిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్

## నేడు కల్వకుర్తికి సీఎం రేవంత్

- బహిరంగ సభ, మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు

కల్వకుర్తి, జూలై 27 : సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం కల్వకుర్తిలో పర్యటించనున్నారు. కొట్ర గేట్ వద్ద మాజీ మంత్రి దివంగత జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణతోపాటు కల్వకుర్తిలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు, పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం ఆయన పర్యవేక్షించారు. అనంతరం కల్వకుర్తి తాసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయం పక్కన నిర్వహించే బహిరంగ సభకు పోలీసులు పకడ్బందీ బందోబస్తు నిర్వహించాలన్నారు. అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతగా నిర్వహించాలని సూచించారు. సీఎం పర్యటన ప్రదేశాల్లో అవసరమైన బారికేడ్లు, శానిటేషన్, పచ్చదనం, బయో టాయిలెట్స్ వంటి ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు చూసుకోవాలని చెప్పారు. అనంతరం ఎస్పీ గైక్వాడ్ సీఎం భద్రతా సిబ్బందితో కలిసి బహిరంగ సభ, విగ్రహావిష్కరణ స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సీతారామారావు, అదనపు ఎస్పీ భరత్, ఆర్డీవో శ్రీను, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

***అధికారులు అప్రమత్తంగా ఉండాలి..***

వెల్దండ, జూలై 27 : వెల్దండ మండలం కొట్ర గేట్ వద్ద మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి.. కలెక్టర్ సంతోష్, ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గోపాల్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, తాసీల్దార్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

## వణికిస్తున్న వ్యాధులు

- జనరల్ దవాఖానకు పెరుగుతున్న రోగులు
- పల్లె, పట్టణాల్లో కొరవడిన పారిశుధ్య చర్యలు
- పాలమూరు జిల్లాలో 124 డెంగీ కేసులు నమోదు
- నివారణపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు

మహబూబ్‌నగర్, జూలై 27 : వ్యాధుల కాలం ఆరంభమైంది. దీంతో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, డయేరియా, టైఫాయిడ్ రోగులు దవాఖానకు క్యూ కడుతున్నారు. ముందస్తుగా పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో గ్రామాలు, పట్టణాల్లో పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుధ్యం అటకెక్కింది. ఏ ఇంట చూసినా దగ్గు, జలుబు, జ్వరంతో సతమతమవుతున్న వారే కనిపిస్తున్నారు. కొన్ని రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో చిన్నా, పెద్ద తేడా లేకుండా మంచానపడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా విషజ్వరాలతో దవాఖానల్లో చేరుతున్నారు. వారం రోజులుగా జనరల్ దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య 1,400 నుంచి 2వేల వరకు పెరిగింది. ప్రైవేట్ దవాఖానల్లో కూడా భారీగానే కేసులు నమోదవుతున్నాయి.

***మెరుగైన వైద్యం అందక..***

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందక జనరల్ దవాఖానను ఆశ్రయిస్తున్న రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ఇక్కడ సాధారణ జ్వరాలు, ఒంటినొప్పులు, ఇతర సమస్యలకు వైద్యం అందిస్తున్నారు. అయితే నిత్యం ఎక్కువ మంది రోగులు వస్తుండడంతో వైద్యులు హడావుడిగా చికిత్స చేస్తూ చేతులు దులుపుకొంటున్నారని రోగులు వాపోతున్నారు. నాడిపట్టి పరీక్షించి రోగితో సమస్య తెలుసుకునే పరిస్థితి లేదని, సాధారణ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి పంపుతున్నారని ఆరోపిస్తున్నారు.

***మొక్కుబడి చర్యలతో సరి...***

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వర్షకాలం పక్కా ప్రణాళిక కొరవడుతోంది. పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో రోగుల తాకిడికి అనుగుణంగా సేవలందడం లేదు. వాన నీరు నిలిచి పొంగిపొర్లకుండా చూడాల్సిన మున్సిపాలిటీ వారు మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు. పారిశుధ్యం, దోమల నివారణకు ఏటా సీజన్‌లో రూ.3కోట్ల మేర ఖర్చు పెడుతున్నా ఫలితం లేకుండాపోతున్నది. జిల్లా కేంద్రంలో కనీసం ఫాగింగ్ మిషన్లు కూడా ఉపయోగించడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉండగా, ఆ దిశగా ఆరోగ్య శాఖ చర్యలు చేపటమ్టడం లేదు. పట్టణంలో నిత్యం లక్ష మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, సేకరించడంలో జాప్యంతో వ్యాధులు ప్రబలడానికి కారణమవుతోంది.

***పెరిగిన డెంగీ కేసులు..***

ఈ ఏడాది జనవరి నుంచి జూలై 21 వరకు 3వేల మందికి డెంగీ పరీక్షలు చేయగా 124 మందికి పాజిటివ్ వచ్చింది. ఇందులో ఆరోగ్యశాఖ పరిధిలో 57 రాగా, జనరల్ దవాఖానలో 67 కేసులు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈ సారి డెంగీ కేసులు పెరిగాయి.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

వాతావరణ మార్పులతో ఒక్కసారిగా రోగుల తాకిడి పెరిగింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రోగాల బారిన పడకుండా చూసుకోవచ్చు. ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలి. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా చూడాలి.

*- డాక్టర్ బాల శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్, జనరల్ దవాఖాన మహబూబ్‌నగర్*



## నాట్య మయూరి

**తెలవారుతున్న వేళ .. చిరుజల్లులతో చల్లటి వాతావరణం.. చుట్టూ పచ్చనిచెట్లు.. ఆహ్లాదకర ప్రకృతిలో మయూరం పురివిప్పి ఆకర్షణీయమైన అందంతో నాట్యమాడింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ట్యాంక్ బండ్ సమీపంలోని పొలాల్లో శనివారం ఈ దృశ్యాన్ని చూసి అటుగా వెళ్తున్న వారు మధురానుభూతి పొందారు. పురివిప్పిన మయూరాన్ని 'నమస్తే తెలంగాణ' తన కెమెరాలో బంధించింది.**

*- మహబూబ్‌నగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జూలై 27*